క్లుప్తంగా

సాయిబాబాకు పుష్పాలంకరణ



ముత్తుకూరు : మండలంలోని వల్లూరులో కొలువైన శ్రీశివసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పుష్పాలంకరణలో సాయిబాబా భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాలతో అలంకరించిన మందిరంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు వల్లూరు మోహనరావు ఆధ్వర్యంలో పల్లకిసేవ చేయించారు. పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చారు.

మనుబోలు పీఏసీఎస్ అధ్యక్షుడి రాజీనామా



ప్రదీప్‌రెడ్డి

మనుబోలు : మనుబోలు పీఏసీఎస్(ప్రాథమిక సహకార పరపతి సంఘం) అధ్యక్షుడు మడమనూరు గ్రామానికి చెందిన మారం రెడ్డి ప్రదీప్‌రెడ్డి గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆయన సొసైటీ అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా ఉన్న బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉప్పలపాటి రామసుబ్బానాయుడు కూడా రాజీనామా చేసినట్లు సొసైటీ సీఈఓ చెంచోబు తెలిపారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సాయిబాబా

మనుబోలు : మండలంలోని మనుబోలు, జట్లకొండూరు, మడమనూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనుబోలులోని పిడూరురోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయంలో అర్చకుడు శ్రీనివాసులు బాబాకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక అలంకరణ చేశారు. మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు

నెల్లూరు సిటీ : బిడ్డలను పెంచి ప్రయోజకులుగా చేసిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం తగదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. నగరంలోని హరనాథపురంలో ఉన్న కేరింగ్ హ్యాండ్స్ వృద్ధుల ఆశ్రమంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వాణి మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించినట్లు తెలియజేశారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

భక్తుల కొంగుబంగారం చాముండేశ్వరీదేవి

- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

ఇందుకూరుపేట : భక్తుల కొంగుబంగారమై నిత్య పూజలందుకునే శ్రీచాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు గురువారం అర్ధరాత్రి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మావులూరు శ్రీధర్‌రెడ్డి, గిరిజమ్మ, మావులూరు శ్రీనివాసులురెడ్డి, దివంగత హరిత పేరుమీద ప్రసాద వితరణ చేపట్టారు. కర్పూర సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

12 రోజుల పాటు..

ఈనెల 24వ తేదీ వరకు 12 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగనున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ప్రతి ఏడాది తరలివచ్చి అమ్మవారి కృపాకటాక్షం పొందనున్నారు. 14న చప్పర ఉత్సవం, 15న గజ వాహనసేవ, 16న సింహ వాహనసేవ, 17న పులి వాహనోత్సవం, 18న అశ్వ వాహనోత్సవం, 19న పులివాహనోత్సవం జరుగనుంది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవం 21వ తేదీ (శుక్రవారం) రాత్రి వైభవంగా జరుగుతుంది. ఈ కల్యాణోత్సవం సందర్భంగా పలువురు యువతీయువకులు అమ్మవారి సన్నిధిలో వధూవరులుగా ఒకటవుతారు. 22న అమ్మవారికి వసంతోత్సవం, త్రిశూలేశ్వరస్వామి ఉత్సవం, గంగోత్సవం నేత్రపర్వంగా జరుగుతాయి.



ప్రత్యేకాలంకరణలో చాముండేశ్వరీదేవి

23న రథోత్సవం

స్వామివారి విశేష ఉత్సవాల అనంతరం అత్యంత ప్రాధాన్యత కలిగిన రథోత్సవం(సిరిమాను) ఆదివారం రాత్రి కనులపండువగా జరుగుతుంది. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో లేనివిధంగా రాత్రివేళ జరిగే ఉత్సవాన్ని వీక్షించేందుకు ప్రజలు, అమ్మవారి భక్తులు జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. రథోత్సవం సందర్భంగా 'అగ్నిగుండం' తొక్కడం ఆనవాయితీ. అదేరోజు ఉదయం తీర్థవాది ఉత్సవం ఉంటుంది. 24వ తేదీ సాయంత్రం అమ్మవారి సన్నిధిలో తెప్పోత్సవం నేత్రపర్వంగా నిర్వహిస్తారు.

ఎక్కడ ఉన్నా స్వగ్రామాలకు..

బ్రహ్మోత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తజనంతో గంగపట్నం 12 రోజుల పాటు కళకళలాడుతుంది. అదే తరుణంలో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు, పెద్దలు, ఉద్యోగాల రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న వారు ఉత్సవాల సమయానికి తమ స్వగ్రామాలకు చేరుకుంటారు. దూరప్రాంతాల నుంచి తరలివచ్చే బంధుమిత్రులు, రక్త సంబంధీకులతో మండలంలోని గ్రామాలు కొత్తకళను సంతరించుకుంటాయి.

సంతాన దేవతగా..

ఆలయ ఆవరణలో ఉన్న కొలనులో 40 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో స్నానమాచరించి ప్రతిరోజు 108 ప్రదక్షిణలు చేస్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో అమ్మవారికి భక్తులు మొక్కుబడులు, పొంగళ్లు పెట్టేందుకు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి కొడి విప్పేంత వరకు ప్రతి ఇంటా మాంసాహారాన్ని నిషేధించడం గంగపట్నం గ్రామంలో మరో విశేషం.





విద్యుద్దీపాల వెలుగులో అమ్మవారి ఆలయం

ముమ్మరంగా వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు అర్బన్ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఇస్కపాళెం–1 సచివాలయంలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్‌ను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోలర్ ఆఫీసర్ డాక్టర్ ఖాదర్‌వలీ గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాక్సినేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జొన్నవాడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, విజయ్‌కుమార్, యాసిన్ అహ్మద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

14 వేల మొక్కల పెంపకం

ముత్తుకూరు : 'మా భూమి–మన భవిష్యత్తు' అనే నినాదంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో 14 వేల మొక్కలు నాటినట్లు అదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5వ తేదీ నుంచి చేపట్టిన మొక్కల పెంపకం గురువారం పూర్తయిందన్నారు. కృష్ణపట్నం, ఆర్కాట్‌పాళెం, ముత్తుకూరు, నారికేళపల్లి, చలివేంద్ర గ్రామాల్లో ఒక ఉద్యమంలా మొక్కల పెంపకం చేపట్టామన్నారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఈ ఉద్యమం చేపట్టామన్నారు. పోర్టు భద్రతా విభాగానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, హేమలత, అముద, గోవిందయ్య, అరుణ్, షాహుల్ పాల్గొన్నారు.



కృష్ణపట్నంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

క్షయవ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

విడవలూరు : క్షయ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి అని రామతీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని దండిగుంట గ్రామంలో ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి క్షయ వ్యాధి నివారణ టీకాలను గురువారం వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే మార్పులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రామతీర్థం పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు క్షయ నియంత్రణ టీకాలు వేశామని వివరించారు. ఇప్పటి వరకు 1,876 మందికి క్షయ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట : పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని నిడిముసలి గ్రామానికి చెందిన నేదురుమల్లి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలలో లయన్స్ క్లబ్ అందజేసిన నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలను ఆయన గురువారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదానందరావు, ఉపాధ్యాయుడు తులసీరాం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- వివాహిత మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రామచంద్రాపురం కాలనీ వద్ద నెల్లూరు వైపు వెళ్తున్న బైక్‌ను కారు ఢీకొట్టడంతో మహిళకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన కృష్ణమోహన్‌రెడ్డి, సుమతి (32) దంపతులు వింజమూరులో బంధువుల ఇంటికి వెళ్లి అక్కడి నుంచి నెల్లూరులోని ఓ హాస్పిటల్‌కు వైద్య పరీక్షల నిమిత్తం బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో దామరమడుగు గ్రామం రామచంద్రాపురం కాలనీ వద్ద ముంబై జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న కారు వేగంగా బైక్‌ను ఢీకొంది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108 వాహనంలో నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుమతి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.

గురుకులాల్లో దోమల నివారణకు చర్యలు



కొడవలూరు గురుకులంలో మలాతియాన్ స్ప్రే చేయిస్తున్న వైద్యాధికారి రామకృష్ణ

కొడవలూరు : కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని చంద్రశేఖరపురం, కొడవలూరు గురుకుల పాఠశాలల్లో గురువారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. గురుకులాల్లోని అన్ని గదుల్లో మలాతియాన్ స్ప్రే చేయడంతో పాటు పరిసరాల్లోనూ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. దోమల వల్ల విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పీహెచ్‌సీ పరిధిలోని గురుకులాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మలాతియాన్ స్ప్రే చేయడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికడుతుందన్నారు. గ్రామాల్లోనూ దోమలు ఉత్పత్తయ్యే ప్రాంతాలను గుర్తించి స్ప్రే చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ పి.దేవసహాయం, సీహెచ్ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్ పాల్గొన్నారు.

మూగజీవాలకు అంతుచిక్కని వ్యాధి

- మృత్యువాతకు గురవుతున్న వైనం
- పట్టించుకోని వైద్యులు

వెంకటాచలం : మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవాలు గత కొన్నిరోజుల నుంచి మృత్యువాతకు గురవుతున్నాయి. ఏ వ్యాధితో మృతిచెందుతున్నాయో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. పశు వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో కానరాకపోవడంతో నిత్యం మూగజీవాలు మరణిస్తున్నాయి. మండలంలోని ఇడిమేపల్లి, రామదాసుకండ్రిగ, జంగాలపల్లి, తిక్కవరప్పాడు, కంటేపల్లి తదితర గ్రామాల్లో గత కొన్నిరోజుల నుంచి గొర్రెలు, మేకలు అకస్మాత్తుగా చనిపోతున్నాయి. మేత కోసం అడవిలోకి తోలిన గొర్రెలలో నిత్యం అంతుచిక్కని వ్యాధితో మృతిచెందుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో మూగజీవాలకు టీకాలు వేయకపోవడం వల్లనే మృతిచెందుతున్నట్లు రైతులు వెల్లడిస్తున్నారు. ఇడిమేపల్లి, జంగాలపల్లి గ్రామాల్లో ఎక్కువగా గొర్రెలు, మేకలు మృతిచెందుతున్నాయని వారు తెలియజేస్తున్నారు.



రామదాసుకండ్రిగలో మృతిచెందిన గొర్రె

పాఠశాలలకు చేరిన స్టూడెంట్ కిట్‌లు



స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు వెళ్తున్న స్టూడెంట్ కిట్‌లు

కొడవలూరు : కొడవలూరు జెడ్పీ హైస్కూల్ స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్‌లను గురువారం చేరవేశారు. వేసవి సెలవుల్లోనే స్టూడెంట్ కిట్‌లు మండలానికి చేరాయి. వేసవి సెలవులు ముగిసి గురువారం పాఠశాలలు పునఃప్రారంభమవడంతో స్టాక్ పాయింట్ నుంచి కిట్‌లను ప్రత్యేక వాహనంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ మండలంలో 80 ప్రభుత్వ పాఠశాలలుండగా, వీటిలో 4,200 మంది విద్యార్థులున్నారని తెలిపారు. వీరందరికీ సరిపడా స్టూడెంట్ కిట్‌లు సెలవుల్లోనే స్టాక్ పాయింట్‌కు చేరాయన్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు అందుబాటులో ఉంటారని గురువారం చేరవేశామన్నారు. వెంటనే వీటిని విద్యార్థులకు అందజేయాలని హెచ్‌ఎంలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఎన్.అంకయ్య, సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, సీహెచ్.లీలయ్య, పులి రమేష్, ఆర్.వీరాంజనేయులు, టీవీ సురేష్, సీహెచ్.శ్రీహరిబాబు, కార్యాలయ సిబ్బంది విజయమ్మ, మస్తానయ్య పాల్గొన్నారు.

- పొదలకూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను అందజేస్తున్నట్లు ఎంఈఓ–2 శోభనాద్రి పేర్కొన్నారు. రెండురోజుల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎంఈఓ కార్యాలయం నుంచి పుస్తకాలను తరలించుకుని వెళ్తున్నట్లు తెలిపారు. స్టూడెంట్ కిట్లు ఇంకా దిగుమతి కాలేదని, బెల్టులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. బ్యాగులు, షూస్, టై తదితర సామగ్రి త్వరలో అందజేస్తామన్నారు.

కొమ్మలపూడిలో భూ వివాదం

మనుబోలు : మండలంలోని కొమ్మలపూడి సమీపంలో హైవే పక్కన ఉన్న డీకేటీ పట్టా పొలాన్ని అదే గ్రామానికి చెందిన రైతు దున్నిస్తుండగా గ్రామంలోని మరో వర్గం ఫిర్యాదుతో పోలీసులు గురువారం అడ్డుకున్నారు. హైవే పక్కన చెరుకుమూడి రెవెన్యూ పరిధిలో 4-1, 12-2, 23-2-4, 23-2-5 సర్వే నంబర్లలో సుమారు ఏడు ఎకరాల డీకేటీ పట్టా భూమి ఉంది. ఇందులో చెందులూరు కల్పన, భారతితో పాటు తనకు పట్టాలు ఉన్నాయని చెందులూరు శ్రీనివాసులు తెలిపారు. దీనిని తాము గత పదేళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలియజేశారు. అయితే గతంలో ఈ భూమిలో దళితులకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని గ్రామంలోని మరో వర్గం వాదిస్తోంది. దీంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో చెందులూరు శ్రీనివాసులు గురువారం పొలం దున్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. సంబంధిత పత్రాలు తీసుకెళ్లి తహసీల్దార్ సమక్షంలో పరిష్కరించుకోవాలని, అప్పటి వరకు భూమిలోకి ఎవరూ ప్రవేశించవద్దని ఎస్సై అజయ్‌కుమార్ సూచించారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి శిక్షణా శిబిరాల్లో క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, సభ్యుడు చింతల అమరేంద్రరెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు కార్యదర్శి ఎస్.రమేష్‌బాబు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కె.జయదేవ్, ఎం.నరేంద్రరెడ్డి, రాఘవేంద్రశెట్టి, గోపాల్‌రెడ్డి, ఎస్.బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగపై రైతుల ఆసక్తి

- మండల పరిధిలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం
- గిట్టుబాటు అవుతున్న ధరలు

పొదలకూరు : వేరుశనగ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఈ పంట సాగు లాభాల బాటలో ఉంది. పొదలకూరు ప్రాంతంలో రైతులు పంటలను మార్పిడి చేసి వేరుశనగ సాగును చేస్తున్నారు. మరో రెండు మాసాల్లో పంట చేతికి అందే అవకాశం ఉంది. మండలంలోని నల్లపాళెం, దుగ్గుంట, తోడేరు, భోగసముద్రం తదితర ప్రాంతాల్లో రైతులు తొలిసారిగా వేరుశనగ సాగుకు సమాయత్తం అయ్యారు. ఈ ఏడాది దుగ్గుంట పంచాయతీలో సుమారు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దశాబ్దాల కిందట ఎప్పుడో ఈ ప్రాంతంలో వేరుశనగ పంట సాగును చేపట్టారని, తిరిగి ఇప్పుడు పంటల మార్పిడి చేసి శనగ సాగు చేపడుతున్నామని రైతులు వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ ప్రాంత రైతులు నిమ్మ, వరి, మినుము, పెసర, పచ్చిశనగ పంటల సాగు తప్పించి ఇతర పంటల సాగుపై దృష్టి సారించింది లేదు.

దిగుబడి వస్తే లాభాలే

వేరుశనగ రైతులు ఆశించిన విధంగా దిగుబడి వస్తే లాభాలు బాగా వచ్చే అవకాశం ఉంది. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి అయ్యే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం క్వింటా వేరుశనగ రూ.7 వేల వరకు ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందని, ఇందులో ఖర్చులు రూ.40 నుంచి రూ.50 వేలు పోను రైతులకు రూ.50 వేలు ఎకరాకు ఆదాయం ఉంటుంది. తొలిసారిగా వేరుశనగను సాగు చేస్తున్న రైతులు లాభాలు గడిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది. మూస పద్ధతిలో ఒకే పంటల సాగును రైతులు చేపడుతుండడం వల్ల నష్టాలు చవిచూస్తున్నారు. పంటల మార్పిడి పద్ధతిని పాటిస్తే లాభాలు గడించ వచ్చునని వ్యవసాయాధికారులు అభిప్రాయపడుతున్నారు.



సాగులో ఉన్న వేరుశనగ పంట

మూడేళ్ల నుంచి సాగు చేస్తున్నా..

దుగ్గుంట పంచాయతీ కొనగలూరులో మూడేళ్లుగా వేరుశనగ సాగు చేస్తున్నా. ఆశించిన స్థాయిలో ఫలసాయం అందుతున్నా అకాల వర్షాల వల్ల కొంత నష్టం వాటిల్లుతోంది. నీటి అభ్యత ఉంటే లాభాలు గడించేందుకు అవకాశం ఉంటుంది.



– కె.రామిరెడ్డి, రైతు, కొనగలూరు

స్వల్పంగా సాగు

మండలంలో ఈ ఏడాది స్వల్పంగా సాగు చేస్తున్నారు. ఇసుక నేలలు ఉన్న ప్రాంతంలో వేరుశనగ పంట ఆశించిన స్థాయిలో ఫలసాయం అందే అవకాశం ఉంది. దుగ్గుంట పంచాయతీలోనే వేరుశనగ సాగు చేస్తున్నారు.

– గీతాకుమారి, ఏఓ, పొదలకూరు